క్లుప్తంగా

నియామకం



కాచిగూడ: పద్మశాలి కుల సమాజ సేవకు యువత ముందుకు రావాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెరుకు మణికంఠకు నియామక పత్రాన్ని సోమవారం యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ అందజేశారు. ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, కందగట్ల స్వామి మాట్లాడుతూ.. పద్మశాలీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వారు సామాజిక, రాజకీయం, ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పద్మశాలీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ప్రకృతి, మనిషికి అవినాభావ సంబంధం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ జీవనం, పచ్చదనానికి అవినాభావ సంబంధం ఉందని హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నాయకులు డీసీపీ కార్యాలయంలో కలిసి సంస్థ రూపొందించిన 2023 కేలండర్‌ను అందజేశారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం మనిషి ధర్మమని పేర్కొన్నారు. కౌన్సిల్ గౌరవ అధ్యక్షుడు ఉప్పల వెంకటేష్‌గుప్తా, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.హెచ్.రంగయ్య, సభ్యులు అవినాష్, టీ.వీ.రమణ పాల్గొన్నారు.

చిత్రాలనగర్ బస్తీ అధ్యక్షుడిగా విశ్వనాథ్



కవాడిగూడ: చిత్రాలనగర్ బస్తీ నూతన అధ్యక్షుడిగా సానేపల్లి విశ్వనాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఓటింగ్ విధానం ద్వారా ఆయనను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, క్రాంతి, యాది, శ్రీనివాస్, నర్సింగరావు, చంద్రకాంత్, టింకు, నవీన్, దినకర్, జగన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమలో స్వేచ్ఛ ఉంటేనే ఆనందం



హిప్నో పద్మాకమలాకర్

చిక్కడపల్లి: ప్రేమలో స్వేచ్ఛ ఉంటేనే ఆనందంగా జీవిస్తారని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. సోమవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీకేర్ సెంటర్‌లో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అమరమైనది ప్రేమేనని అలాంటి ప్రేమ పేరు చెప్పి మోసం చేసి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నది యువతేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిజమైన ప్రేమకు ఈ లోకంలో విలువ లేదని ప్రేమ పేరుతో హత్యలు, ఆత్మహత్యలకు, యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. ఇద్దరు వ్యక్తులు కలసి జీవితం సాగించాలంటే ముందుగా వారి ఇరువురి మధ్య నమ్మకం ఉండాలన్నారు. దేశానికి యువతే వెన్నెముక లాంటి వారని యువత తమలోని అపార శక్తి యుక్తులను వెలికితీసి కాలానికి తగిన నైపుణ్యాలను పుణికి పుచ్చుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు.

పక్షవాతానికి ఉచిత చికిత్స

కాచిగూడ: శ్యామ్ మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో ఈనెల 15న బుధవారం నుంచి 20 సోమవారం వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పక్షవాతానికి ఆధునిక పరికరాలతో ఉచిత చికిత్స అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్యామ్‌మందిర్ ప్రాంగణంలోని ఫిజియోథెరఫీ సెంటర్‌లో ఉచిత వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. చికిత్స అనంతరం బీఎంఐ, బీఎండీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని సోమవారం రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీ.ఎల్ చారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం



సబర్మతినగర్‌లో నాలా రిటర్నింగ్ వాల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం అవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతినగర్‌లో హుస్సేన్‌సాగర్ నాలా రిటర్నింగ్ వాల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పనులు త్వరితగతిన నాలా రిటైనింగ్ వాల్ పనులను పూర్తి చేయిస్తామన్నారు. రూ. 69 కోట్లతో కవాడిగూడ గోశాల నుంచి గోల్నాక నాలా వరకు ఈ రిటర్నింగ్ వాల్ పనులు జరుగుతున్నాయన్నారు. అరుంధతినగర్, బాపునగర్, అశోక్‌నగర్ ప్రాంతాల మీదుగా పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ వాల్ నిర్మాణం వల్ల వర్షాలు పడిన సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలిగే అవకాశం ఉండదన్నారు. స్థానికులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్‌ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నేతలు ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీష్, మారిశెట్టి నరసింగరావు, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎస్సీపేమ్, రవిశంకర్‌గుప్తా, జీహెచ్ఎంసీ ఎస్ఎన్‌డీపీ నీటిపారుదలశాఖ ఏఈ శ్యాంసుందర్, స్థానిక బస్తీ వాసులు జీవగిరి, ఎండీ యాసీన్, జహంగీర్, నర్సింగ్‌రావుముదిరాజ్, ఎండీగౌస్, రాజు, చందు, బీఆర్‌ఎస్ నేతలు కిరణ్‌కుమార్, వెంకటేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారి నవీన్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

మురుగు నిలవకుండా చర్యలు..

ముషీరాబాద్: నగరంలోని అతిపెద్ద ముషీరాబాద్ చేపల మార్కెట్ చౌరస్తాలో మురుగు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులకు సూచించారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని చేపల మార్కెట్‌లో మురుగు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన జలమండలి సెక్షన్ మేనేజర్ నవీన్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ మ్యాన్‌హోల్ రోడ్డు కంటే కొంత ఎత్తులో ఉండడం వల్ల మురుగునీరు నిలిచిపోతుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, మహేష్, ఎయిర్‌టెల్ రాజు, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో నూతన డ్రైనేజీ పనులు



సత్యానగర్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియాజకవర్గంలోని పలు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ పైప్‌లైన్ శిథిలావస్థకు చేరడంతో తరుచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే బడ్జెట్ నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ సత్యనగర్‌లో జీహెచ్ఎంసీలోని వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు.

- బస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.
- స్థానికుల అభ్యర్థన మేరకు బస్తీలో కమ్యూనిటీహాల్‌లో అవసరమైన సదుపాయాలు, షెడ్డు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
- బోర్ పంప్‌కు సొంత ఖర్చులతో మరమ్మతులు చేపడతానని బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ. 3 లక్షలు మంజూరు అయ్యేలా చూస్తానన్నారు. వాటర్ వర్క్స్ డీజీఎం సన్యాసి రావు, ఏఈ భావన, జీహెచ్ఎంసీ డీఈ సువర్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, బీఆర్‌ఎస్ నాయకులు రాంబాబు, సత్యనగర్ బస్తీ అధ్యక్షుడు రాంచందర్, బస్తీ వాసులు రాజేష్, ప్రతిభ, బిక్షపతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, తదితరులు

కవాడిగూడ: పేదలకు రూ.5 లక్షల వరకు ఉచితంగా ఆధునిక వైద్యం అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భారత్ కార్డు పొందిన వారు ఏ ప్రైవేటు ఆసుపత్రిలోనైనా వైద్య సేవలు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. కవాడిగూడ డివిజన్ దోమలగూడ వినాయక్‌నగర్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పరశురాం ఆధ్వర్యంలో సోమవారం ఆయుష్మాన్ భారత్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిరుపేదలకు సరైన వైద్యం అందక వారు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రతి పేద కుటుంబం వైద్య సేవలను పొందేలా కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. శంకర్‌లాల్, యువమోర్చా నాయకులు అనిల్‌కుమార్, మోహన్‌సాయి, బస్తీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ జరపాలి

ముషీరాబాద్: మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రమాదేవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ జరిపి కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పరశురామ్, విజయ్‌కన్నాలు డిమాండ్ చేశారు.

- వరుస ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సైకాలజిస్టులు, డాక్టర్లను అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.
- ర్యాంకుల వేటలో ప్రాణాలు వదులుతున్న విద్యార్థులను ప్రభుత్వం కాపాడి వారిని మనోస్థైర్యం నింపే విధంగా తగిన కార్యచరణ ఉండాలని నిబంధనలను పాటించని విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వాటి గుర్తింపు రద్దు చేయాలన్నారు.
- ఆత్మహత్యలపై వేసిన ప్రొఫెసర్ నీరదారెడ్డి కమిటీ సిఫార్సులను బహిర్గతం చేసి కార్పొరేటర్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలన్నారు. విద్యార్థి ఆత్మహత్య ప్రయత్నం జరిగిన వెంటనే సంబంధిత కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అభినందన



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్‌ను సోమవారం తెలంగాణ ముదిరాజ్ సంఘం నేత, తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, వరలక్ష్మీలు కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. డిప్యూటీ చైర్మన్‌గా ముదిరాజ్‌లకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు సీట్లు ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్‌లో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం



అంబర్‌పేట: అభివృద్ధి, ప్రజాసేవ పట్ల ఆకర్షితులై బీజేపీ నుంచి కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరడంపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తున్నామన్నారు. సోమవారం గోల్నాకకు చెందిన పలువురు మహిళా నేతలు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. నర్సింగ్‌రావుయాదవ్, మహిళా మోర్చా గోల్నాక డివిజన్ అధ్యక్షురాలు అనిత, సెంట్రల్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కనకమ్మ, అర్చన, సంధ్య, సత్య, దేవలక్ష్మి తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

‘హాత్ సే హాత్ జోడోయాత్రతో బీఆర్‌ఎస్‌లో వణుకు’



యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

కవాడిగూడ: హాత్‌సే హాత్ జోడోయాత్రకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుండటంతో అధికార బీఆర్‌ఎస్‌లో వణుకు ప్రారంభమైందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కేసీఆర్ అబద్ధాలను ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఆ పార్టీకి సరైన గుణపాఠం చెబుతారన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ ఈ- సేవా నుంచి మున్సిపల్ క్వార్టర్స్, ఈశ్వరమ్మబాడ, ఎస్‌బీహెచ్ కాలనీ, దోమలగూడ ప్రాంతాల్లో జరిగిన ‘హాత్ సే హాత్ జోడో యాత్ర’లో అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. టీపీసీసీ రాష్ట్ర నాయకులు శ్రీరాముల యాదగిరి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు వీ.డీ.కృష్ణ, మాజీ కార్పొరేటర్లు కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, నగర కాంగ్రెస్ నాయకుడు పాశం అనిల్‌కుమార్, లక్ష్మణ్, గుర్రం శంకర్, ప్రభాకర్, మహేష్‌కుమార్, సాయిబాబా, మేడి సురేష్‌కుమార్, భాస్కర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం’



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆరోపించారు. సోమవారం రాత్రి కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్‌లో నిర్వహించిన ‘ప్రజాగోస - బీజేపీ భరోసా’ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, పార్టీ నేతలు బండారు సంతోష్‌కుమార్, వినోద్‌యాదవ్, కృష్ణగౌడ్, శ్యామ్‌రావు, కె.నర్సింగ్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్నర్ మీటింగ్

అంబర్‌పేట: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తుందని బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. డివిజన్ అధ్యక్షులు భూషణ్‌చారి, నాయకులు కృష్ణగౌడ్, బుచ్చిరెడ్డి, అయోధ్య రాములు, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, యాదగిరి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో..

ఖాద్రిబాగ్‌లో జరిగిన కార్యక్రమానికి గౌతమ్‌రావు హాజరుకాగా.. బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్, ఎం.శంకర్, వంశీకృష్ణ, నర్సింగ్‌యాదవ్, చంద్రశేఖర్‌గౌడ్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన చిన్నారులు

ముషీరాబాద్: రెండో అంతర్జాతీయ కరాటే, మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు 2023 ఫిబ్రవరి11, 12న ఘనంగా జరిగాయి. ఈ పోటీలను న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆర్గనైజర్ పీ.వీ.శ్రీరాములు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని జ్యోతి బాలమందిర్ ఉన్నత పాఠశాల, ఓమెగా హైస్కూల్, కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు 14 మంది పాల్గొనగా.. 13 మంది బంగారు పతకాలను సాధించారు. ఒకరు ద్వితీయ స్థానంలో నిలిచారు. కరాటే కోచ్ పవన్‌కల్యాణ్ విద్యార్థుల ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు. ఓమేగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వాణి, కరస్పాండెంట్ నవమోహన్ రావు, కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు నవీన్, జ్యోతి బాలమందిర్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ సీనియర్ నేతకు మాతృవియోగం

ముషీరాబాద్: ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ షాహేద్ మాతృమూర్తి మహమూద భాను(70) సోమవారం ఉదయం ఏక్‌మినార్‌లోని ఆమె నివాసంలో మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియగౌడ్, బీఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు జాఫర్ తదితరులు నివాళులర్పించారు.

‘వాలంటైన్స్‌డేను నిషేదించాలి’



కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న శివసేన నేతలు

కాచిగూడ: వాలంటైన్స్‌డేను నిషేదించి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని కోరుతూ శివసేన ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు ‘సేవ్ ఇండియన్ కల్చర్ - బైకాట్ వాలంటైన్స్ డే’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారతీయ సంస్కృతి, సంప్రాదాయాలపై అవగాహన కల్పిస్తూ.. వాలంటైన్స్‌డేను బహిష్కరించాలని శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశానికి సేవ చేయాలనుకునే వారు మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి వాటివల్లే లవ్ జిహాద్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. యువసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌట్ గణేష్, నేతలు మహేష్, గోపాల్, రాజ్, భానుచందర్, తిరుపతి, మారుతీ, శంకర్, సాగర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తనతోనే ఐఏఎస్ సాధించా.. !

చిక్కడపల్లి: వరంగల్‌లో ఉద్యోగిగా ఉన్న సమయంలో కలెక్టర్ కార్యాలయంలో రేషన్‌కార్డు కోసం వెళ్తే అక్కడ ఉద్యోగి నిర్లక్ష్య ప్రవర్తనే రేషన్ కార్డు ఇచ్చే స్థాయికి రావాలని ఐఏఎస్ సాధించానని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో డాక్టర్ రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన పేరిట ప్రతిభా పురస్కారాలను అందజేశారు. పత్రికా సంపాదకులు సుబ్బారావు, కళా పోషకులు రాఘవరెడ్డి, నాట్య గురువు సజనికి ప్రదానోత్సవం సభ జరిగింది. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. ఏ పాఠశాలలో చదివాము, ఏ భాషలో చదివామనేది ముఖ్యం కాదనే విషయాన్ని నేటి యువత గ్రహించి పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. చిల్లా రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రామరాజు శ్రీనివాసరావు, టీవీ న్యూస్ రీడర్ విజయచంద్రిక తదితరులు పాల్గొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, కవి వెంకటదాసు పాల్గొన్నారు.



డాక్టర్ కేవీ రమణాచారిని సన్మానిస్తున్న దృశ్యం

పెండింగ్ పనులకు అనుమతి ఇవ్వాలని వినతి



చిక్కడపల్లి: పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఛాంబర్‌లో కలిసి గాంధీనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం అనుమతి కోరుతూ.. బీజేపీ యువనేత వినయ్‌కుమార్‌తో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో అపరిష్కృతంగా ఉన్న రోడ్ల నిర్మాణం పార్కుల అభివృద్ధితో పాటు గతేడాది 2022లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని విన్నవించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

రైళ్లపై రాళ్లు రువ్వే వారిపై చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్‌కుమార్

కాచిగూడ: రైళ్లపై రాళ్ల విసిరే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కాచిగూడ ఇన్స్‌పెక్టర్ ధర్మేందర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి జామై ఉస్మానియా, ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్వేట్రాక్‌కు ఇరువైపుల ఉన్న బస్తీల ప్రజలను పిలిచి వారికి అవగాహన కల్పించారు. రైళ్లపైన రాళ్లు వేయకూడదని సూచించారు. ప్రయాణీకులకు రాళ్లు తగిలితే వారి ప్రాణాలు పోయే అవకాశం ఉటుందన్నారు. కొంతమంది ఆకతాయిలు చేస్తున్న పనుల వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ట్రాక్ పెట్రోలింగ్ చేసి రైలుపట్టాల వెంట నడుస్తున్న వారిని గుర్తించి వారికి తగిన సూచనలు, సలహాలు చేశారు. రైలు ప్రయాణీకులకు మెరుగైన భద్రత కల్పించడంతో పాటు నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రయాణీకులకు సేవలందించడమే కాకుండా నేరాలను అరికట్టడంలో ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జైలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డ్రంక్ అండ్ కేసులో 11 మంది వ్యక్తులను కోర్టులో హాజరు పరిచారు. 10 మందికి జైలు, జరిమానా విధించగా, ఒక్కరికి జరిమానా విధించారని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ దరావత్ నాను నాయక్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.